క్లుప్తంగా

'మనుధర్మం'తోనే అసమానతలు



ప్రతులను దహనం చేస్తున్న అంబేడ్కర్ భవన్ సభ్యులు

పాకాల : మనుధర్మ శాస్త్రంతోనే సమాజంలో అంటరానితనం, అసమానతలు ప్రారంభమైనట్లు స్థానిక అంబేడ్కర్ భవన్ అధ్యక్షుడు గుండ్లపల్లి ఆంజనేయులు మండిపడ్డారు. బుధవారం ఈ మేఉకు మనుధర్మ ప్రతులను దహనం చేశారు. 1927 డిసెంబర్ 25వ తేదీన అంబేడ్కర్ ఈ శాస్త్ర ప్రతులను దహనం చేశారని, ఆయన స్ఫూర్తితో ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం మానవ హారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో అంబేడ్కర్ భవన్ సభ్యులు బాబ్జీ, ఆదికేశవులు, ప్రభు, విజయమోహన్‌రెడ్డెప్ప, జగన్నాథం, రెడ్డెప్ప, జయబాల, సుధాకర్, వినాయక, నరసింహులు, నాగరాజా, శివప్రసాద్, వెంకటస్వామి, రామచంద్ర, శ్రీరాములు, రవి, సంపత్, జ్యోతిప్రసాద్, వెంకటరత్నం పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 125 మందికి పరీక్షలు

పాకాల : స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం పాకాల ప్లాటినం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాల, చిత్తూరు ఆస్పత్రి వారి సహకారంతో డాక్టర్లు రమేష్, డాక్టర్ తులసి వైద్య సేవలు అందించారు. సుమారు 125 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తులసీరామన్, కార్యదర్శి ఆర్‌వీ ప్రసాద్, సభ్యులు గురుస్వామినాయుడు, కుప్పుస్వామి నాయుడు, జయరాంనాయుడు, దొరస్వామి నాయుడు, డీసీ రామయ్య, మస్తాన్, బాలాజీ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

'నాడోడి బతుకులు' ఆవిష్కరణ



నవలను ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్ : మూరిశెట్టి గోవింద్ రచించిన 'నాడోడి బతుకులు' నవలను రచయిత పలమనేరు బాలాజీ బుధవారం ఆవిష్కరించారు. యూత్ హాస్టల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బాలాజీ మాట్లాడుతూ యానాదుల ఆచార వ్యవహారాలు, సంస్కృతికి ఈ నవల దర్పణం పట్టిందని తెలిపారు. పుస్తకాన్ని సమీక్ష చేసిన ఆచార్య పీసీ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో కూడా యానాది సామాజిక వర్గం అనాగరికులుగా మిగిలిపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర నేత సాకం నాగరాజు, జిల్లా అధ్యక్షుడు యువశ్రీ మురళి, తిరువాయిపాటి రాజగోపాల్, గోవిందయ్య, డాక్టర్ మౌని, ఇస్లాపురం బాలసుబ్రమణ్యం, జీఎస్ ప్రసాద్, మునిప్రసాద్, నాగరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు మండల మీట్

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ యుగంధర్‌రెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గిడ్డయ్య తెలిపారు.బుధవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి సభ్యులు హాజరుకావాలని స్పష్టం చేశారు.

అలిపిరి మార్గంలో కొండచిలువ

తిరుపతి క్రైం: అలిపిరి మెట్ల మార్గంలో కొండచిలువ బుధవారం హల్‌చల్ చేసింది. తిరుమలకు చేరుకునే ముందు పది అడుగుల కొండ చిలువ భక్తులకు కనిపించింది. దీనిపై సమాచారం అందుకున్న స్నేక్ క్యాచర్ భాస్కర్ నాయుడు అక్కడకు చేరుకుని చాకచక్యంగా పట్టుకున్నారు. అవ్వాచారి కొండల్లో చిలువను వదిలిపెట్టారు.

ముగిసిన కంప్యూటర్ శిక్షణ



విద్యార్థులతో నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో రెండు రోజులుగా 40 మంది పేద పిల్లలకు నిర్వహించిన కంప్యూటర్ శిక్షణ బుధవారంతో ఘనంగా ముగిసింది. ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత తహసున్నీసాబేగం మాట్లాడుతూ పిల్లలకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించేందుకు శిక్షణ ఇప్పించామన్నారు. పిల్లలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు రాజ్‌కుమార్, నాదముని, లత, సాగరిక, అంకయ్య పాల్గొన్నారు.

రేపటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుపతి కల్చరల్ : ఎస్వీయూలోని శ్రీనివాస ఆడిటోరియంలో ఈ నెల 27వ తేదీ నుంచి రెండు రోజులపాటు జాతీయ స్థాయి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజ గౌడ్, బంజారా జన్ సంఘ్ అధ్యక్షుడు హరిచౌహాన్ నాయక్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు.

లోక రక్షకుని ఆగమనంతో క్రైస్తవులు పులకించారు. దైవకుమారుని పుట్టినరోజును పురస్కరించుకుని క్రిస్మస్ వేడుకలను సంబరంగా జరుపుకున్నారు. శాంతిదూత సందేశం విని పరవశించారు. పాపాల నుంచి విముక్తి కల్పించమని వినయ్యను ప్రార్థించారు. క్రీస్తు జన్మ వృత్తాంతం ఆలకించి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. పేదలకు చేయూతనందించి దాతృత్వం చాటుకున్నారు. ప్రత్యేక ఆరాధనలో పాలుపంచుకుని కరుణామయుని కీర్తించారు.

శాంతి సంబరం

● ఘనంగా క్రిస్మస్ వేడుకలు ● చర్చిల్లో ప్రత్యేక ఆరాధనలు ● భక్తిశ్రద్ధలతో క్రైస్తవుల ప్రార్థనలు





తిరుపతి వెస్ట్ చర్చిలో బాల యేసు దృశ్యాలతో సెట్టింగ్



ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

తిరుపతి కల్చరల్ : క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. అందులో భాగంగా తిరుపతి నగరంలో ఈస్ట్ చర్చి, వెస్ట్ చర్చి, జగన్మాత చర్చిలో క్రీస్తు జన్మ వృత్తాన్ని తెలిపేలా వేసిన సెట్టింగ్‌లు విశేషంగా ఆకట్టుకున్నాయి. చర్చిల వద్ద పేదలకు అన్నదానంతోపాటు దుస్తులు పంపిణీ చేశారు. వెస్ట్ చర్చి, సౌత్ ఆంధ్ర లూథరన్ ఈస్ట్ చర్చి, జగన్మాత చర్చిల్లో పాస్టర్లు క్రిస్మస్ సందేశం అందించారు. వెస్ట్ చర్చి క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. స్వీట్లు, కేకులు, క్యాలెండర్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఫాస్టర్ జాన్సర్, చైర్మన్ పి.భూపాల్, వైస్ చైర్మన్ ఏ.విక్టర్ రాజారావు, కార్యదర్శి వీపీఎస్.చంద్రశేఖర్, కోశాధికారి వి.ఆనంద రాకేష్, ఎస్.కే శామ్యూల్ కేసరి బాబు, కేఎం మంజుల, జే.దిలీప్ పాల్గొన్నారు. ఖాదీకాలనీలోని జగన్మాత చర్చి, రాజన్న పార్క్ వద్దనున్న సౌత్ ఆంధ్ర లూథరన్ ఈస్ట్ చర్చిలో మంగళవారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. కేబీ లేఔట్‌లోని షెకీనా ప్రార్థనా మందిరంలో వేడుకలు క్రిస్మస్ ఆరాధనలతో ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కేక్ కట్ చేసి సంబరాల్లో పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

తాటితోపులోని చర్చ్ ఆఫ్ హోలీ స్పిరిట్, ఆంగ్లికన్ చర్చి ఆఫ్ ఇండియా బిషప్ ఎస్.వేదనాయగం ఆధ్వర్యంలో క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. అనంతరం పేదలకు దుస్తులు, బిర్యానీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేద కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ దేవి, డాక్టర్ శ్యామ్‌కుమార్, పాస్టర్లు హేమంత్‌కుమార్, దేవన్న, ఆనంద్‌కుమార్, సిస్టర్ చంద్రమ్మ, పాల్గొన్నారు.

ప్రేరణ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో..

తిరుపతి సిటీ : బైరాగిపట్టెడలోని మాతృస్య ఫౌండేషన్, తిరుచానూరులోని నవజీవన్ బ్లైండ్ రిలీఫ్ సెంటర్‌లో బుధవారం ప్రేరణ హెల్పింగ్ సొసైటీ టీమ్ శాంతా క్లాజ్ వేషధారణలో ఆకట్టుకున్నారు. ప్రేరణ సెక్రటరీ రాజశేఖర్ మాట్లాడుతూ అనాథ ఆశ్రమంలోని పిల్లలతో ఆత్మీయంగా క్రిస్మస్ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.

పాకాలలో..

పాకాల : స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఏసు క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని చాటి చెబుతూ చిన్నారు లఘు నాటిక ప్రదర్శించారు. జింగిల్ బెల్స్ పాటకు శాంటాక్లాజ్ వేషధారణలో ఆంథోని, మరో ముగ్గురు మహిళలు చేసిన నృత్యం అలరించింది.

చిన్నగొట్టిగల్లులో..

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలంలో క్రిస్మస్ను వేడుకగా జరుపుకున్నారు. భాకరాపేట షకీనా ప్రార్థనా మందిరంలో పాస్టర్ సైలేష్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సర్పంచ్ సాకిరి భూపాల్ పాల్గొన్నారు.



పాకాల: సీఎస్ఐ చర్చిలో ప్రార్థన చేస్తున్న పాస్టర్ ప్రేమ్‌కుమార్



పాకాల: శాంతాక్లాజ్‌తో కలిసి నృత్యం చేస్తున్న యువతులు



తిరుపతి వెస్ట్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి

శ్రీవారి సేవలో మాజీ మంత్రి రోజా



శ్రీవారి ఆలయం వెలుపల రోజా, జగదీశ్వర్‌రెడ్డి

తిరుమల : తిరుమల శ్రీవారిని మాజీ మంత్రి ఆర్‌కే రోజా బుధవారం సేవించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆమె వెంట చొక్కారెడ్డి జగదీశ్వర్‌రెడ్డి ఉన్నారు.

వ్యాస రచనలో రాజేష్ ప్రతిభ



రాజేష్‌ను అభినందిస్తున్న టీటీడీ డీఈఓ

తిరుపతి సిటీ : జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాస రచన (తెలుగు) పోటీలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల బీఏ మూడో సంవత్సరం విద్యార్థి టి.రాజేష్ తృతీయ బహుమతి గెలుచుకున్నారు. ప్రశంసాపత్రం, రూ.3వేల నగదు అందుకున్న విద్యార్థి రాజేష్‌ను బుధవారం కళాశాలలో టీటీడీ డీఈఓ డాక్టర్ నాగరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ భాస్కరుడు, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ మల్లికార్జున అభినందించారు.

చంద్రగిరి ఈఓపీఆర్‌డీగా వెంకటరత్నం

చంద్రగిరి : మండల ఈఓపీఆర్డీగా వెంకటరత్నం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాళహస్తి శిక్షణ కేంద్రంలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ శేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈఓపీఆర్‌డీ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ క్రమంలో పలువురు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా లిటిల్ ఏంజెల్స్ వార్షికోత్సవం



విద్యార్థికి అవార్డు అందిస్తున్న నైనా జైస్వాల్

తిరుపతి కల్చరల్ : మహతి కళాక్షేత్రంలో లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్ 44వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథులుగా ఇంటర్నేషనల్ క్రీడాకారిణి డాక్టర్ నైనా జైస్వాల్, పాఠశాల అధినేత కె.రాజగోపాల్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ కేఆర్ శ్వేతారెడ్డి, సహాయ కార్యదర్శి ఎం. శేఖర్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ సందర్భంగా అకడమిక్ కాంపిటేటీవ్ పరీక్షల్లో ప్రతిభ చాటిన పోగూరి వికాస్, హేమస్వరూప్‌కు ఔట్ స్టాండింగ్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు అందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ వై.పద్మశ్రీ, డైరెక్టర్ సి.అరవిందరెడ్డి పాల్గొన్నారు.

'సంకల్ప'లో ఈపీఎస్ సేవలు



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరామ్

తిరుపతి కల్చరల్ : తుడా రోడ్డులోని సంకల్ప హాస్పిటల్‌లో కార్డియాక్ ఆబ్లేషన్ చికిత్స నేపథ్యంలో ఆధునాతనమైన ఎలక్ట్రో ఫిజియాలజీ టెస్ట్ వైద్య చికిత్స (ఈపీఎస్) సేవలు అందుబాటులో ఉన్నాయని హాస్పిటల్ ఎండీ డాక్టర్ నాగరాజు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రో ఫిజియాలజీ టెస్ట్ కోసం గతంలో హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల నుంచి డాక్టర్లను పిలిపించాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ఎలక్ట్రో ఫిజియాలజీ టెస్ట్‌లో నైపుణ్యం కలిగిన డాక్టర్ శ్రీరామ్ అందుబాటులో ఉన్నారని వెల్లడించారు. కార్డియాక్ సమస్య ఉన్నవారికి ఎలక్ట్రో ఫిజియాలజీ టెస్ట్ ఎంతో అవసరమన్నారు. అనంతరం కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీరామ్ ఎలక్ట్రో ఫిజియాలజీ టెస్ట్ గురించి వివరించారు. సమావేశంలో మెడికల్ డైరెక్టర్ అనంతనాగ్ పాల్గొన్నారు.

బడాబాబుల 'పార్కింగ్'



బస్టాండ్ ముందు పార్క్ చేసిన కార్లు

తిరుపతి సెంట్రల్ బస్టాండ్ వద్ద సామాన్య ప్రయాణికులకు తిరస్కారమే ఎదురవుతోంది. కనీసం ద్విచక్రవాహనాలను పార్క్ చేసుకునేందుకు కూడా అవస్థలు తప్పడం లేదు. బస్టాండ్ ప్రధాన ద్వారం వద్ద సుమారు 200 బైక్‌లు పార్క్ చేసేందుకు సరిపడా స్థలం ఉంది. అయినప్పటికీ అందులో కేవలం 50 వాహనాలు పట్టే ప్రాంతం మాత్రమే వదిలిపెట్టారు. మిగిని స్థలం చుట్టూ ఇనుప రాడ్లతో కంచె ఏర్పాటు చేశారు. ఆ స్థలంలో బడాబాబులు తమ కార్లు నిలబెట్టుకునేందుకు అవకాశం కల్పించారు. కనీసం వారు ఆర్టీసీ ప్రయాణికులు కూడా కాకపోవడం గమనార్హం. బస్టాండ్ చుట్టపక్కల హోటళ్లు, ఇతర వ్యాపారాలు నిర్వహించుకునే వారు ఈ స్థలంలో తమ కార్లు పార్క్ చేసుకుంటూ ఉంటారు. సదరు పెద్దమనుషులకు ఆర్టీసీ ఉన్నతాధికారులతో పరిచయం ఉండడమే ప్రధాన అర్హత. ఒకవేళ వారు రాకపోయినా అందులో ఎవరూ ద్విచక్రవాహనాలు పార్క్ చేయడానికి వీలు లేదు.

విద్యార్థినులకు అభినందన

తిరుపతి సిటీ : చెన్నై ఎస్ఆర్ఎం వర్సిటీలో గురువారం నుంచి నిర్వహించనున్న సౌత్‌జోన్ సాంస్కృత పోటీలకు పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. బుధవారం ఈ మేరకు విద్యార్థినులను టీటీడీ డీఈఓ డాక్టర్ నాగరాజు అభినందించారు. ఆయన మాట్లాడుతూ కళాశాల పేరుప్రతిష్టలను ఇనుమడింపచేయాలని కోరారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ భద్రమణి మాట్లాడుతూ విద్యార్థినిలు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించి విజేతలుగా నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల సాంస్కృతిక విభాగం ఇన్‌చార్జి నాగ పద్మ, హాస్టల్ వార్డెన్ హేమలత, గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ విద్యుల్లత, అధ్యాపకులు పద్మజ, దివ్యవాణి, కల్చరల్ కో–ఆర్డినేటర్ లక్ష్మీసంధ్య పాల్గొన్నారు

ఆర్టీసీ అద్దె బస్సుల జోరు

తిరుపతి అర్బన్ : ధనుర్మాసం నేపథ్యంలో తిరుపతి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు జోరుగా అద్దెకు వెళుతున్నాయి. బుధవారం కాణిపాకం, శ్రీపురం, కంచికి మూడు సూపర్ లగ్జరీ సర్వీసులను అద్దెకు పంపినట్లు డిపో మేనేజర్ బాలాజీ తెలిపారు. ఎవరైనా ఆర్టీసీ సర్వీసులు అద్దెకు కావాలంటే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. సురక్షితమైన ప్రయాణం కోసం అంతా ఆర్టీసీ బస్సులను ఎంపిక చేసుకోవాలని కోరారు.

చెట్టును ఢీకొన్న కారు

● ఆరుగురికి గాయాలు

సిద్దవటం : వైఎస్సార్ జిల్లా సిద్ధవటం మండలంలోని మిట్టపల్లె సమీపంలో బుధవారం తెల్లవారుజామున కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో తిరుపతికి చెందిన ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. ఆటో నగర్‌కు చెందిన నాగేష్ , వెంకటయ్య, శ్రీనివాసులు, జ్యోతి, కీర్తన, అభిషేక్ కారులో హైదరాబాద్‌కు వెళుతుండగా ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

సాహిత్యంతో సమాజ సంస్కారం



సర్వోత్తమరావును సత్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్ : సమాజాన్ని సంస్కరించేందుకు సాహిత్యమే సాధనమని పంచ సహస్రావధాని మేడసాని మోహన్ తెలిపారు. బుధవారం యూత్ హాస్టల్లో జిల్లా రచయితల సంఘం ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లా రచయితల సంఘం అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజు, మన్నవ గంగాధర ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్యంపై విద్యార్థులకు అభిరుచి కల్పించే దిశగా కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. సభాధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అతి తక్కువ సమయంలో 64 మంది శాశ్వత సభ్యత్వం తీసుకోవడం అభినందనీయమన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు గార్లపాటి దామోదర నాయుడు రచించిన అన్నమయ్య వేంకటేశ్వర శతకాన్ని తాళ్లపాక వంశీయుడు హరినారాయణ ఆవిష్కరించారు. డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, పరమేశ్వరయ్య శతక ప్రాశస్తిని వివరించారు. అనంతరం ఆచార్య సర్వోత్తమ రావు, వి.ప్రతిమ, పల్లిపట్టు నాగరాజును ఘనంగా సత్కరించారు. సంఘం నేతలు అంకమనాయుడు, యువశ్రీ మురళి, డాక్టర్ మౌని, మోహన మునిసిద్ధారెడ్డి, తమటం రామచంద్రారెడ్డి, గొడుగు చింత గోవిందయ్య, ఏడుకొండలు, మాలేపట్టు పురుషోత్తమాచారి, రొద్ద సురేంద్ర, దేవసేన నాయుడు, సుభద్ర, సుభాషిణి, శోభ, గజేంద్రరెడ్డి, ఉషారాణి, సుకుమార్‌రెడ్డి, రవిశేఖర్, చెంచయ్య, రమేష్‌కుబార్, చెన్నకేశవులు, గుల్జార్ గౌస్ పాల్గొన్నారు.

మాట ప్రకారం కౌశిక్‌కు సాయం

తిరుపతి కల్చరల్ : క్యాన్సర్‌తో బాధపడుతూ ప్రాణాపాయస్థితిలో ఉన్న కౌశిక్‌కు ఇచ్చిన మాట ప్రకారం ఆర్థిక సాయం అందించి కాపాడుకున్నామని జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం రాష్ట్ర కన్వీనర్ కృష్ణయాదవ్ వెల్లడించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అభిమాని కౌశిక్‌ను జూనియర్ ఎన్టీఆర్ పరామర్శించారన్నారు. ఆయన పిలుపుతో అభిమానులు, టీటీడీ ఉద్యోగులు చేయూతనందించారని వెల్లడించారు. జూనియర్ ఎన్టీఆర్ సాయం చేయలేదని సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం కావడం శోచనీయమన్నారు. ఆస్పత్రి బిల్లు మొత్తం రూ.77లక్షలు కాగా, టీటీడీ రూ.40లక్షలు, ప్రభుత్వం రూ.11లక్షలు అందించాయని చెప్పారు. మిగిలిన సొమ్మును తాము చెల్లించి కౌశిక్‌ను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేయించి ఇంటికి చేర్చామని తెలిపారు. ఈ క్రమంలోనే మరో మూడు నెలల వరకు కౌశిక్‌కు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘ ప్రతినిధులు రాజేష్, వరదారెడ్డి, మురళి, నాని, జానకిరామ్, సోము, నంద పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీలకు ఎస్వీయూ విద్యార్థులు

తిరుపతి సిటీ : చెన్నై ఎస్ఆర్ఎం వర్సిటీలో గురువారం నుంచి ప్రారంభం కానున్న సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల సాంస్కృతిక పోటీల్లో ఎస్వీయూ విద్యార్థులు పాల్గొననున్నారు. బుధవారం ఈమేరకు సాంస్కృతిక విభాగం కో–ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ నేతృత్వంలోని ఎస్వీయూ బృందానికి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు అభినందించారు.

గాలిలో దీపం

కూటమి ప్రభుత్వ వంచనపై ప్రజల్లో తీవ్రమైన ఆగ్రహం వ్యక్తమవుతోంది. సూపర్ సిక్స్ హామీల్లో ముఖ్యమైన ఉచిత గ్యాస్ పథకం అరకొరగా అమలవుతోంది. పేదింట వెలగాల్సి 'దీపం' కొడిగట్టిపోతోంది. మహిళలకు ఏటా మూడు సిలిండర్లు అందిస్తామని ఆర్భాటంగా చేసిన ప్రకటన తేలిపోతోంది. సర్కారు మాటలను నమ్మిన లబ్ధిదారులపై ఆంక్షల కోత పడుతోంది. దీంతో గ్యాస్ బుక్ చేసుకుని డెలివరీ అయిన తర్వాత నగదు కోసం ప్రజానీకం ఎదురు చూడాల్సిన దుస్థితి దాపురించింది.

ఉచిత గ్యాస్ ఉత్తిదే!

- సిలిండర్ డెలివరీ అయినా ఖాతాల్లో పడని నగదు
- లబ్ధిదారులకు తప్పని నిరీక్షణ
- వేలాదిమందికి మొండి చెయ్యి
- కూటమి వంచనపై మండిపడుతున్న మహిళలు



గ్యాస్ కనెక్షన్ల సమాచారం
తిరుపతి నగరం : 68,103
రూరల్ మండలం : 55,315
చంద్రగిరి : 19,100
పాకాల : 11,252
ఎర్రావారిపాళెం : 6,200
చిన్నగొట్టిగల్లు : 8,790
రామచంద్రాపురం : 3,109

తిరుపతి రూరల్ : సూపర్‌సిక్స్‌లో భాగంగా దీపం 2.0 పథకం కింద ఏడాదికి మూడు సిలెండర్లు చొప్పున ఉచితంగా అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం గృహ వినియోగ సిలెండర్ ధర గరిష్టంగా రూ.876 ఉంది. ఇందులో కేంద్రం రూ.25 వరకు రాయితీ ఇస్తుండగా, మిగిలిన రూ.851లను సిలెండర్ అందిన 48 గంటల్లో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలి. దీపం పథకం కింద అక్టోబర్ 31 నుంచి ప్రారంభం అయిన గ్యాస్ కనెక్షన్ల బుకింగ్‌లో సిలిండర్ డెలివరీ అయిన తర్వాత కూడా తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాలకు సంబంధించి సుమారు 23,688 మందికి నగదు ఖాతాల్లో జమ కాలేదని గణాంకాలు చెబుతున్నాయి. రేషన్‌కార్డు, ఆధార్, గ్యాస్ కనెక్షన్ లింకు కాలేదని, కనెక్షన్ ఉన్న వ్యక్తి పేరు రేషన్ కార్డులో లేదని, ఈకేవైసీ పూర్తి కాలేదని, ఆన్‌లైన్‌లో చూపించడం లేదనే సాకులతో లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సమస్య పరిష్కరిస్తున్నాం

దీపం పథకం కింద గ్యాస్ బుకింగ్‌లో కానీ, డెలివరీ తర్వాత అమౌంట్ పడకపోవడం వంటి సమస్యలు తలెత్తినా వెంటనే మా దృష్టికి తీసుకురావాలి. వాటిని అక్కడికి అక్కడే పరిష్కరించేలా సిబ్బంది పనిచేస్తున్నారు. దీపం పథకం కింద ఎలాంటి సమస్య ఉన్నా..టోల్‌ఫ్రీ నంబర్ 1967కు కాల్ చేయాలి.

– రామాంజనేయులు నాయక్, తహసీల్దార్, తిరుపతి రూరల్

పైసా పడలేదు



గ్యాస్ బుక్ చేసుకున్నాం. సిలెండర్ కూడా వచ్చింది. డబ్బులు మొత్తం ఇస్తేనే సిలెండర్ ఇచ్చారు. అకౌంట్లో 48 గంటల్లోనే డబ్బులు పడతాయి అన్నారు. కానీ 15 రోజులు అయినా కూడా ఇంత వరకు పైసా పడలేదు. ఈకేవైసీ చేయాలని ఇప్పుడు అంటున్నారు.

– లలిత, గృహిణి, తిరుపతి

అంతా మోసం



ఉచిత సిలెండర్లు అంటూ మోసం చేస్తున్నారు. సిలెండర్ డబ్బులు ఇంత వరకు మా అకౌంట్లో పడలేదు. కనీసం స్పందించేవారు కూడా లేరు. మొత్తం డబ్బులు కట్టి సిలెండర్ తీసుకోవాల్సి వస్తోంది. ఒక్క దానికే దిక్కు లేదు. మూడు ఎలా ఇస్తారో ఆ దేవుడికే తెలియాలి.

– సంపూర్ణమ్మ, పెరుమాళ్లపల్లె, తిరుపతి రూరల్

వైభవంగా గంగమ్మ జాతర

చంద్రగిరి : మండలంలోని మామండూరులో గంగజాతరను వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి గ్రామ నడిబొడ్డున గంగమ్మ ప్రతిమను కొలువు దీర్చారు. బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. మహిళలు అంబలి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.